నేడు యథావిధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమం

ప్రజాశక్తి - కాకినాడ

కలెక్టరేట్‌లో సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేయబడిన ఈ కార్యక్రమం జిల్లా స్థాయిలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు కలెక్టరేట్‌లో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. పిజిఆర్ఎస్‌కు రాలే అర్జీదారులు వారి అర్జీలను Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. అర్జీదార్లు వారి యొక్క అర్జీల స్థితిని తెలుసుకోవాలంటే 1100కి నేరుగా కాల్ చేయవచ్చని ఆయన తెలిపారు.

మహాసభలో మాట్లాడుతున్న వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి కెఎస్ శ్రీనివాస్

జిల్లా మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - పిఠాపురం

ఈ ఏడాది డిసెంబర్ 4, 5 తేదీల్లో తాళ్ళరేవులో నిర్వహించే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని పి.రాయవరం గ్రామంలో కె సింహాచలం అధ్యక్షతన మండల మహాసభ జరిగింది. మండల కార్యదర్శి ఊబ బుల్లబ్బాయ్ కార్యదర్శి నివేదికను ప్రయివేశపెట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలన్నారు. పేదలు, దళితుల చేతుల్లో ఉన్న ప్రభుత్వ అసైన్డ్ భూములను సంపన్నులకు కట్టబెట్టే ఫ్రీ హోల్డ్‌పై నిషేధం ఎత్తివేయడం తగదన్నారు. కార్మికులకు రోజురోజుకీ ఉపాధి లేక వలసలు పెరిగిపోతున్నాయని, ఉపాధి హామీ చట్టం ద్వారా 200 రోజులు పనులు కల్పించి వలసలు నివారించాలన్నారు. వ్యవసాయ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి కార్మికులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీ 17 మందితో ఏకగ్రీవంగా ఎన్నికోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయానికి సంఘం నాయకులు రుద్రవరపు భూలోకం, కాలదారి రాఘవ, దవ్వాల కృష్ణ, మామిడి ఆశీర్వాదం, డెక్కల లాజరు, తంగేటిపల్లి పాప, బోడ మహాలక్ష్మి, పెదపూడి దుర్గారావు, బత్తుల నాగరాజు, పల్లేటి నాగేశ్వరరావు, మేడపాటి చంటిబాబు పాల్గొన్నారు.

చైతన్యవంతులను చేసిన గ్రంథాలయ ఉద్యమం

ప్రజాశక్తి - కాకినాడ, కరప

కాకినాడలో గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ప్రజలను చైతన్యవంతులను చేయడంలో గ్రంథాలయ ఉద్యమం కీలకంగా మారిందని పలువురు అన్నారు. కాకినాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎపి రెసిడెన్షియల్ కాలేజ్ రిటైర్డ్ లెక్చరర్ ఎన్.పెద్దిరాజు, జిల్లా వయోజన విద్యా శాఖా అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ వి.త్రిమూర్తులు, ప్రముఖ స్వీయ రచనా గాయకులు, ఘంటసాల పురస్కార గ్రహీత మేడిశెట్టి శ్రీరాములు, డిఆర్‌డిఎ శిక్షణా నిపుణులు ఎం.సత్యబాల పాల్గొని మాట్లాడారు. ప్రజలను విజ్ఞాన వంతులను చేసి చైతన్య వంతులుగా చేసేందుకు గ్రంథాలయ ఉద్యమం ఉపయోగపడిందన్నారు. గ్రంథాలయో ద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య ఈ ఉద్యమాన్ని ప్రారంభించారని, గ్రంథాలయోద్యమం ప్రజలను చైతన్య వంతుల్ని చేయడం ద్వారా భారత స్వాతంత్ర్య, ఉద్యమాలలో భాగం వహించిందన్నారు. ఎందరో గ్రంథాలయోద్యమ నేతలు ప్రజా ఉద్యమాలలో పాల్గొని ప్రజలను చైతన్యవంతం చేశారని అన్నారు. గ్రంథాలయాలు సమాజ అభివృద్ధికి మార్గదర్శకాలు, జ్ఞానోదయానికి పునాదులు, ప్రజల్లో స్ఫూర్తిని కలిగించే శక్తి కేంద్రాలు అని విశదీకరించారు. గ్రంథాలయోద్యమానికి తమ జీవితాన్ని అంకితం చేసిన ఉద్యమకారుల సేవలను స్మరించుకున్నారు. భవిష్యత్ తరాలకు పఠన సంస్కృతిని పరిచయం చేయడం, గ్రామస్థాయిలో గ్రంథాలయాలను బలోపేతం చేయడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు జూనియర్స్, సీనియర్స్‌కు దేశభక్తి, జానపద గేయాలు పోటీలు నిర్వహణకు న్యాయ నిర్ణేతలుగా మేడిశెట్టి శ్రీరాములు, ఎం.సత్యబాల వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయాధికారి ఇన్‌చార్జ్ కె.కిషోర్, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎం.శ్రావ్య, గ్రంథాలయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే గాంధీనగర్ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జూనియర్స్ విభాగంలో పుస్తక పఠనం ఆవశ్యకత, సీనియర్స్ విభాగంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర అనే అంశాలపై పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు, సంస్కార భారతి జిల్లా ప్రధాన కార్యదర్శి గునుపూడి సావిత్రిప్రసాద్, డ్రాయింగ్ ఉపాధ్యాయులు టి.జైరామ్, పాఠకులు పాల్గొన్నారు. **కరప** మండలంలోని వేళంగి గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి పాట్నీడి వెంకట రంగయ్య ఆధ్వర్యంలో గ్రంథాలయ పితామహులు అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి వేళంగి గ్రాడ్యుయేట్స్ యూత్ ప్రతినిధులు షేక్ లాలిబాబు, ఎర్ర విక్రమ్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొండేపూడి రాంబాబు, చెక్క నూకరాజు పాఠకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకుడు సత్యనారాయణ

చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పెద్దాపురం

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని పాండవ గిరి పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ పిలుపునిచ్చింది. ఆదివారం స్థానిక యూనియన్ కార్యాలయం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు వడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు గత వైసిపి ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందన్నారు. సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసిందని దుయ్యబట్టారు. ఎన్నికల సమయంలో సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీల నేతలు నేడు ఆ హామీని విస్మరించి పాలన సాగిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు గూనూరు వెంకటరమణ, కరణం అప్పన్న, యాసలపు మహేష్, సివి.చందు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ వద్ద ఐఎఫ్‌టియు ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టియు నాయకులు

నేడు కలెక్టరేట్ వద్ద ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఐఎఫ్‌టియు కార్యాలయంలో కరపత్రం ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా రోజుకు 8 గంటల పనిని 10 గంటలకు పెంచుతూ తీర్మానం చేసిందని అన్నారు. కార్మికుల శ్రమను, వేతనాన్ని పెట్టుబడిదారులు దోచుకోవడానికి మరో అవకాశం కల్పించిందన్నారు. కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో దశలవారీ ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు రాష్ట్ర కోశాధికారి గుబ్బల ఆదినారాయణమూర్తి, నాయకులు కె.నరసింహ, తాతారావు, చంద్రరావు, ఆదివిష్ణు, అప్పలరాజు, మహేష్, త్రినాధ్, స్వామి, వరలక్ష్మి, శ్రీకాంత్, దుర్గ మహేష్ పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పట్టణంలో మొగలి నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం కిరణ్ కంటి ఆసుపత్రి నిర్వహణలో స్థానిక వాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో గొల్లప్రోలు, ప్రత్తిపాడు, భోగాపురం, రాపర్తి, రాయవరం గ్రామాలకు చెందిన సుమారు 150 మంది పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 40 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. ఈ సందర్భంగా మొగిలి నరసింహమూర్తి మాట్లాడుతూ ఇప్పటివరకు 10 గ్రామాల్లో ఉచిత కంటి పరీక్షల శిబిరాలు ఏర్పాటు చేశామని, మిగిలిన గ్రామాలలో ఉచిత కంటి శిబిరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ శిబిరంలో డాక్టర్ కరుణ, డాక్టర్ సాల్మన్‌రాజ్, టెక్నీషియన్స్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తునిలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్

ప్రజాశక్తి - కోటనందూరు

తుని పట్టణంలోని కొండ వారి పేట ప్రాంతంలో సిఐ ఎం.గీతా రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక బలగాల ఆదివారం తెల్లవారుజామున కార్డెన్ చర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ప్రాంతంలో నాటు సారా అమ్మకాలు, గంజాయి సేవించేవారు ఎక్కువగా ఉన్నారని సమాచారంతో తనిఖీలు నిర్వహించామని సిఐ తెలిపారు. ప్రతి గృహాన్ని, అనుమానితులైన వారి ఆధార్ కార్డులను, బైకులు రికార్డులను తనిఖీలు నిర్వహించారు. పట్టణంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లయితే 9440796572 ఫోన్ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సిఐ తెలిపారు.

కార్డెన్ చర్చ్ ఆపరేషన్ చేస్తున్న సిఐ గీతారామకృష్ణ, సిబ్బంది

రాష్ట్రానికి రూ.13 వేల కోట్ల పెట్టుబడులు

ప్రజాశక్తి - సామర్లకోట

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ చినరాజప్ప

విశాఖపట్నంలో 2 రోజులుపాటు నిర్వహించిన సిఐఐ పరిశ్రమల భాగస్వామ్య సదస్సు ద్వారా రాష్ట్రానికి రూ.13 వేల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కృషి ఫలితంగా పెద్దఎత్తున పెట్టుబడులు మన రాష్ట్రానికి రావడంతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. చంద్రబాబుపై ఉన్న నమ్మకంతో పారిశ్రామిక వేత్తలు రాష్ట్రానికి వస్తున్నారని తెలిపారు. పరిశ్రమల భాగస్వామ్య సదస్సు విజయవంతం అయ్యాయని అన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్ విండో పద్ధతిలో అనుమతులను ప్రభుత్వం జారీ చేస్తున్నట్లు చెప్పారు. వైసిపి పాలనలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ వచ్చిన పరిస్థితి లేదన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిపై వైసిపి నాయకులు అవాకులు చవాకులు పేలుతున్నారని అన్నారు. కాకినాడ జిల్లాకు భారీగా పరిశ్రమలు తరలిరానున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి రాజా సూరిబాబురాజు, పట్టణ టిడిపి అధ్యక్షులు బడుగు శ్రీకాంత్, గౌరవాధ్యక్షులు అడబాల కుమారస్వామి, భీమేశ్వరాలయ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ కంటే జగదీష్‌మోహన్ బాబు, మండల టిడిపి అధ్యక్షులు ముసిరెడ్డి శ్రీరాములు, పార్టీ నాయకులు నూనె రామారావు, బలుసు వాసు, పిల్లాడి సత్యవతి, బాడితమాని త్రిమూర్తులు, తాతపూడి అరుణ్ వంశీ పాల్గొన్నారు.

పలుచోట్ల కార్తీక వన సమారాధనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జగ్గంపేట మండలంలో పలు చోట్ల ఆదివారం కార్తీక వన సమారాధన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. స్థానిక కొత్త నరసింహారావు పామాయిల్ తోటలో ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబును సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. రామవరం మంచినీటి చెరువుగట్టు వద్ద ఉన్న వినాయక కమిటీ ఆధ్వర్యంలో వన సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో

జగ్గంపేటలో కొండబాబును సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘీయులు

ఎంపిడిసి సభ్యులు దొడ్డ శ్రీను తదితరులు పాల్గొన్నారు. జగ్గంపేట కొప్పుల వెలమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. **గండేపల్లి** మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీకి చెందిన అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ పరిపాలన విభాగ సిబ్బంది కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాన్స్, మ్యూజికల్ చైర్ పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. అలాగే మండలంలోని సింగరంపాలెం గ్రామానికి చెందిన రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, టిడిపి మండల అధ్యక్షులు పోతుల మోహనరావును రాజమహేంద్రవరంలో ఆదివారం జరిగిన కాకతీయ కమ్మ వన సమారాధనలో ఎంపి దగ్గుపాటి పురందరిశ్వరి చేతులమీదుగా సత్కరించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ సంఘీయుల అభివృద్ధికి కోసం కృషి చేస్తానని అన్నారు. కమ్మ కార్పొరేషన్ ద్వారా యువత ఆర్థిక అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటానని అన్నారు. **తాళ్లరేవు** మండలంలో జరిగిన తెలగా అభ్యుదయ సంఘం, శెట్టిబలిజ సంక్షేమ సంఘం, క్షత్రియ సంక్షేమ సంఘం వన సమారాధన కార్యక్రమాల్లో ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనుమరుగవుతున్న కుటుంబ సంబంధాలు భావి తరాల చిన్నారులకు అందించాలని అన్నారు. విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని, ప్రతి ఒక్కరూ తమ చిన్నారులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి

తాళ్లరేవులో మాట్లాడుతున్న ఎంఎల్‌సి రాజశేఖరం

చేయాలని కోరారు. అందుకు తల్లీదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చిన్నారులకు, మహిళలకు ప్రత్యేక ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. **పెదపూడి** రజక చైతన్య సంఘం నియోజకవర్గం అధ్యక్షుడు, మురమళ్ల వెంకటరమణ అధ్వర్యంలో జి.మామిడాడ గ్రామంలో రజక చైతన్య సంఘం కార్తీక వన సమారాధన జరిగింది. ఈ కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లమిల్లి విజయ్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైసిపి గ్రామ కన్వీనర్ మేడపాటి తాతారెడ్డి, ద్వారంపూడి వెంకటరెడ్డి, మల్లిడి శ్రీనివాసారెడ్డి, రజకసంఘం నాయకులు గొల్లకోట సీతారాముడు, ఏసురాజు, జే.సత్యనారాయణ, నాగరాజు, సత్యవాడ సూర్యనారాయణ, దేవగుప్తాపు సాంబమూర్తి, ములంపాక వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

కష్టాల్లో ఉన్న స్నేహితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు హైస్కూల్లో 1989-90 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గోపులంక గోదావరి తీరంలో ఆదివారం జరిగింది. యోగక్షేమాలు, కుటుంబ, పరిస్థితులు ఒకరికొకరు పంచుకున్నారు. 50 ఏళ్లు దాటినా వారంతా ఆటపాటలతో సరదాగా గడిపారు. ఆనాటి చదువుకున్న మిత్రులులలో పేదలు, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి అండగా నిలవాలని నిర్ణయించారు. ఇటీవల మృతి చెందిన మిత్రులు, మిత్రుల బంధువులకు సంతాపం తెలిపారు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న ఒక స్నేహితునికి అన్ని విధాల భరోసాగా నిలవాలని తీర్మానించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తూ ఉత్తమ సేవా అవార్డును అందుకున్న అత్తిలి శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. కష్టాల్లో ఉన్న స్నేహితులను ఆదుకోవడానికి ఆత్మీయ సమ్మేళనంకు హాజరుకాని

ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

మిత్రులు సైతం సహకరించాలనీ పిలుపునిచ్చారు. అనంతరం ఆటపాటలతో సందడి చేశారు.

ప్రజా దర్బార్‌లో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప వినతులు స్వీకరించారు. సామర్లకోట బ్రౌన్ పేట సెంటర్లోని కనకదుర్గమ్మ ఆలయాన్ని నూతనంగా నిర్మించాలని ఆలయ కమిటీ నాయకులు కోరారు. ప్రస్తుతం ఉన్న దేవాలయం రోడ్డు మార్జిన్‌లో ఉండటంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం అవుతుందన్నారు. వెనుక ఉన్న ఆలయ స్థలంలో నూతన ఆలయాన్ని ప్రభుత్వం ద్వారా నిర్మించాలని కోరారు. ప్రజాదర్బార్‌లో 43 వినతిపత్రాలు వచ్చినట్లు పట్టణ టిడిపి అధ్యక్షులు బడుగు శ్రీకాంత్ చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాజా సూరిబాబురాజు, అడబాల కుమారస్వామి, కంటే బాబు, ముసిరెడ్డి శ్రీరాములు, బలుసు వాసు పాల్గొన్నారు.



వికలాంగుడి నుంచి అర్జీని స్వీకరిస్తున్న చినరాజప్ప

కార్టూ'నిజం'



రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - తాళ్లరేవు

శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు

సుంకరపాలెం ఆర్ అండ్ బి రహదారి నిర్మాణానికి ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి డిఇ శ్రీనివాస్, ఎఇ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ రోడ్లు భవనాల శాఖ నిధుల నుంచి రూ.3.60 కోట్ల అంచనాతో తాళ్ళరేవు, కాజులూరు మండలాల్లో రహదారులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. సుంకరపాలెం రహదారికి రూ. 1.80 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. సుంకరపాలెం జంక్షన్ నుంచి 500 మీటర్ల సిసి రోడ్డు, 2 కిలోమీటర్లు బిటి రోడ్డును నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ 2014లో ఈ ప్రాంతంలో 10 మీటర్ల సిసి రోడ్డు వేశామని, అప్పటినుంచి వైసిపి ప్రభుత్వం ఒక్క సిసి రోడ్డు నిర్మించలేదని అన్నారు. ఈ ఏడాది నియోజకవర్గంలో అయినాపురంలో రూ. 3 కోట్లు, ఐ. పోలవరంలో రూ. 60 లక్షలు, తాళ్లరేవు మండలానికి రూ.1.80 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సుంకర పాలెంలో రహదారికి ఇరువైపులా ప్రజలు నడిచి వెళ్లడానికి వీలుగా ప్లాట్ ఫామ్ నిర్మించనున్నట్లు తెలిపారు. జంక్షన్లో ఉన్న డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి యానం, పుదుచ్చేరి ప్రభుత్వంతో చర్చించినట్లు తెలిపారు. రహదారికి అనుసంధానంగా డ్రెయినేజీ నిర్మిస్తామని చెప్పారు. రవి కళాశాల ఎదురుగా మరో 190 మీటర్ల డ్రెయిన్ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. రోడ్డు పక్కన ఉన్న ఆక్రమణలు తొలగించడానికి ప్రజలు, వ్యాపారస్తులు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జ్ మోపూరి వెంకటేశ్వరరావు, సర్పంచులు టిల్లపూడి నాగేశ్వరరావు, కోరుకొండ సంహాద్రమ్మ, లచ్చిపాలెం సొసైటీ అధ్యక్షులు మోపూరి రెడ్డినాయుడు, డిసి ఛైర్మన్ వేగేశ్న భాస్కరరాజు, టిడిపి మండల అధ్యక్షులు ధూళిపూడి బాబి, నాయకులు ఆకెళ్ళ నాగేశ్వరరావు, గుంటముక్కల సూరిబాబు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఎసి విజయలక్ష్మి

మరిడమ్మ ఆలయం వద్ద అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ ఆలయం వద్ద ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసి విజయలక్ష్మి మాట్లాడుతూ దేవాలయానికి సుధీర ప్రాంతాల నుంచి యాత్రికులు వస్తున్నారని అన్నారు. యాత్రికులకు ఇబ్బందులు లేకుండా దాతల సహకారంతో ప్రతీ ఆదివారం అన్నదానం కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తలెఇపారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు ఐవి.ప్రసాద్‌శర్మ, ఎన్‌వి.అవధాని, శంకర్, ఆశాధులు రాయి నాని, రామచంద్రప్రసాద్, సిబ్బంది ఎస్.రమణ, జి.క్రాంతి, వరహాలు, శివ, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమ భవన నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

స్థానిక సామర్లకోట రహదారిలోని ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న వృద్ధాశ్రమ నిర్మాణ పనులను ఆదివారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాశ్రమాన్ని నాణ్యతతో నిర్మించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు, తదితరులు పాల్గొన్నారు.

18న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - కరప

వేళంగి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 18న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ ప్రతినిధులు డాక్టర్ బి.వెంకన్నరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18వ తేదీన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వేళంగి గ్రామంలోని శ్రీనివాస నర్సింగ్ హోం ఆవరనలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఎల్‌వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో కోడిరి రంగారావు సుబ్బలక్ష్మి, జగ్గంపేట లైన్ డిస్టిక్ కంటి హాస్పటల్ ఆధ్వర్యంలో లైన్ గ్రంధి వెంకటేశ్వరరావు సౌజన్యంతో ఆపరేషన్లు ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి కళ్ళజోళ్ళు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సారాపై ఉక్కుపాదం

'ప్రజాశక్తి'తో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎం.కృష్ణకుమారి

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జిల్లాలో సారా రవాణా, తయారీపై తమ శాఖ ఉక్కుపాదం మోపిందని, దానిలో భాగంగా అక్రమ సారా తయారీ, అమ్మకాలను ఎప్పటికప్పుడు నివారిస్తూ దాడులు చేస్తున్నామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎం.కృష్ణకుమారి తెలిపారు. దీనికోసం గత టీడీపీ ప్రభుత్వం 2016లో అమలు చేసిన నవోదయం కార్యక్రమాన్ని కూటమి సర్కారు పునరుద్ధరించినట్లు తెలిపారు. నవోదయం 2.0 పేరిట ఎక్కడికక్కడే సారా తయారీ, రవాణాను అడ్డుకుంటున్నామన్నారు. ఇప్పటికే పాత నేరస్తులను బైండోవర్ చేశామన్నారు. సారా బాధిత గ్రామాల్లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇంకా పలు అంశాలను ఆమె 'ప్రజాశక్తి' ముఖాముఖిలో వివరించారు.

అక్రమ మద్యం కేసులు ఎన్ని? ఎంతమందిని అరెస్టు చేశారు?

ఎక్సైజ్ శాఖను ఏపి ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. ఒకే లైన్ ఆఫ్ ఫోర్స్‌గా ఏకీకృతం చేసింది. జిఒ నంబర్ 188 ప్రకారం తాగడానికి పనికిరాని ప్రయోజనాల కోసం మద్యం తయారీతో సహా మత్తు పదార్థాల ఉత్పత్తి, అమ్మకం, రవాణా వినియోగాన్ని నియంత్రించింది. దీనిలో భాగంగా గతేడాది అక్టోబర్ 1 నుంచి ఈనెల 9 వరకూ జిల్లా వ్యాప్తంగా అక్రమ మద్యం, సారా, బెల్లం ఊటలను ధ్వంసం చేసి 2,359 కేసులు బనాయించాం. 1813 మందిని అరెస్టు చేశాం.

సారా కేసులు ఎన్ని?

జిల్లాలో గడచిన 3 నెలల కాలంలో నాటు సారా తయారీ, అమ్మకాలు జరిపిన వారిపై పెద్ద ఎత్తున కేసులు పెట్టాం. ఈ కేసుల్లో పలువుని మందిని అరెస్టు చేసి వారి నుంచి 11,201 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నాం. 7 లక్షల 52 వేల 450 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయడం జరిగింది. 123 వాహనాలను సీజ్ చేశాం.

బెల్ట్ షాపులపై ఎటువంటి చర్యలు తీసుకున్నారు?

గత ఏడాది కాలంలో 3 కంటే ఎక్కువ మద్యం బాటిళు కలిగి ఉంటే నిబంధనలకు విరుద్ధం. ఈ నేపథ్యంలో జిల్లాలో పలు బెల్ట్ షాపుల కలిగిన వారిపై కేసులు పెట్టాం. ఈ కేసుల్లో 1057 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నాం.

ఇతర రాష్ట్రాల మద్యం అమ్మకాలపై చర్యలు?

యానాం, తెలంగాణ రాష్ట్రాల నుంచి మన జిల్లాకు అక్రమంగా మద్యం అమ్ముతున్న వారిని గుర్తించి అరెస్టు చేశాం. 1661 లీటర్ల యానాం మద్యంను స్వాధీనం చేసుకోగా కొన్ని గంజాయి కేసుల్లో 19.03 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నాం.

అక్రమ మద్యంపై ఎటువంటి చర్యలు?

ప్రజారోగ్యం, సామాజిక, శాంతి భద్రతల పరిరక్షణను ప్రధాన కర్తవ్యంగా తీసుకొని అక్రమ మద్యం తయారీ, రవాణా, విక్రయాలపై, సారా, కల్తీ కల్లు, అనుమతి లేని మద్యం దుకాణాలపై నిరంతరం దాడులు జరిపి అక్రమాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో 7 ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్స్, ఇఎస్ టాస్క్ ఫోర్స్, ఎన్ఫోర్స్‌మెంట్ బృందాలు అన్ని ఏ4 మద్యం షాపులు, బార్లు పర్మిట్ రూములు ఇండస్ట్రియల్ ఏరియాలు, పాడుబడ్డ భవనాలు, మారుమూల ప్రాంతాలలోని అనుమానిత బిల్డింగ్స్ కుణ్ణంగా తనిఖీ చేయడం ద్వారా జిల్లాలో నకిలీ మద్యం తయారీ, అమ్మకం వంటి కార్యకలాపాలు ఉంటే చర్యలు తీసుకుంటున్నాం. అక్రమ మద్యం, స్పిరిట్, ఇతర నకిలీ మద్యం తదితరాలు జిల్లాలోనికి ప్రవేశించకుండా, తయారు కాకుండా నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా నిరోధించడం జరుగుతున్నది.

పర్యవేక్షణ ఎలా చేస్తున్నారు?

జిల్లాలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాలను అరికట్టడం కోసం ప్రత్యేక బృందాలు నిరంతర పర్యవేక్షణతో ఎప్పటికప్పుడు దాడులు జరుపుతూ ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాల నియంత్రణ కోసం నిరంతరం కృషి చేస్తున్నాం.

కాకినాడ జిల్లాలో 171 మద్యం షాపులు, 9 బార్లలో మద్యం నాణ్యతను నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుంది. మద్యం దుకాణాలు ప్రారంభం నుంచి అంటే గతేడాది అక్టోబర్ 16 నుంచి ఇప్పటి వరకు 1343 శాంపిల్స్ ను సేకరించి వాటిని రీజనల్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ల్యాబొరేటరీకి పంపి నివేదికలను పొందడం జరిగింది. ఈ నివేదికలలో ఎక్కడా కల్తీ మద్యం ఆనవాళ్ళు లభించలేదు.

నకిలీ మద్యాన్ని ఎలా గుర్తించాలి?

ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ఎక్సైజ్ సురక్ష యాప్‌ను విడుదల చేశారు. ఎవరైనా మద్యం బాటిళ్లు కొనుగోలు చేసినపుడు అనుమానం వస్తే ఇ యాప్ ద్వారా మూత మీద ఉన్న హీల్‌ని మాత్రమే స్కాన్ చేయాలి. దీని ద్వారా కొనుగోలు చేసిన మద్యం బాటల్ సరైనదా నకిలీదా తెలుసుకోవచ్చు. ఒకవేళ నకిలీదయితే వెంటనే టోల్ ఫ్రీ నంబరు 14405 కు తెలియజేయాలి. నాటుసారా, కల్తీ కల్లు తయారీని అరికట్టడంలో ప్రజల సహకారం అత్యవసరం. ఏదైనా అనుమానాస్పద మద్యం తయారీ, విక్రయాల గురించిన సమాచారం ఉన్నట్లయితే వెంటనే టోల్ ఫ్రీ నెంబరు 14405కు ఫోన్ ద్వారా గానీ, లేదా సమీప ఎక్సైజ్ స్టేషన్‌లో గానీ తెలియజేయాలి. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఆమె తెలిపారు.

నవోదయం 2.0 కార్యక్రమాన్ని ఎలా అమలు చేస్తారు?

నవోదయం 2.0 కార్యక్రమాన్ని మూడు విభాగాలుగా విభజించారు. వాటిలో ఒక్కో గ్రామాన్ని ఎక్సైజ్ అధికారులు దత్తత తీసుకోనున్నారు. పాత కేసుల్లో ముద్దాయిల నేర చరిత్ర, ఆ గ్రామ స్వరూపం తెలుసుకుంటారు. గ్రామపెద్దలు, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో కలిసి అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. విఆర్ఒ, విఆర్ఎ, సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులతో సమన్వయ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేస్తారు. నేర చరిత్ర ఉన్నవారిని పిలిచి ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ ఇస్తారు. కలెక్టర్, ఎస్‌పి, ఐటిడిఎ పిఒ ఆధ్వర్యంలో వారికి ఉపాధి కల్పించే ఏర్పాట్లు చేస్తారు.

నేరాలు ఘోరాలు

బాలికపై లైంగిక దాడి : నిందితుని అరెస్టు

ప్రజాశక్తి - సీతానగరం

ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి, బాలికపై లైంగిక దాడికి పాల్పడటమే కాక, ఆమెను బెదిరించి డబ్బులు వసూలు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీతానగరం పోలీసులు రఘుదేవపురం గ్రామానికి చెందిన నిందితుడు గడుసుల నాగ వెంకటేష్, అతని తల్లి రమణపై పోక్సో, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఇంటర్ చదివిన ఒక బాలిక ఎయిర్ హోస్టెస్ కోచింగ్ కోసం విశాఖపట్నంలో ఉంది. ఏడాది క్రితం వెంకటేష్‌కు ఆమె వాట్సాప్‌లో పరిచయమైంది. దీంతో ఆమెను పెళ్లి చేసుకుంటానని వెంకటేష్ నమ్మించాడు. సంవత్సర కాలంగా ఆమె నుంచి రూ.లక్ష వరకూ వసూలు చేశాడు. గత అక్టోబర్ 31న ఇంటర్వ్యూ పేరుతో మాయమాటలు చెప్పి బాలికను హైదరాబాద్ తీసుకువెళ్లాడు. అక్కడ ఒక హోటల్‌లో వారిద్దరూ కలిసి దిగిన ఫోటోలు, వీడియోలను నెట్‌లో పెడతానని బెదిరించి ఆమెపై మూడు రోజుల పాటు లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం ఆమెను రఘుదేవపురం తీసుకువచ్చాడు. బాలిక ఫిర్యాదు మేరకు వెంకటేష్‌ను పోలీసులు ఆదివారం అదుపులోనికి తీసుకున్నారు.

ఇంట్లో బంగారం, నగదు చోరీ

ప్రజాశక్తి - నల్లజర్ల

ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళం పగలగొట్టి లోపలికి చొరబడి ఎనిమిది కాసులు బంగారం రూ.50 వేల నగదు అపహరించిన సంఘటన మండలంలోని అచ్చన్నపాలెంలో చోటు చేసుకుంది. ఎస్‌సి కాలనీకి చెందిన బోడి గడ్డ ప్రసాద్ ఇటీవల అనారోగ్యంతో బాధ పడుతూ కొద్ది రోజులు హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొంది వచ్చారు. అనంతరం రెండు రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లి ఆదివారం ఇంటికి తిరిగి వచ్చారు. ఇంటి తాళాలు పగలగొట్టి, ఇంట్లో నగలు, నగదు దొంగిలించినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించినట్టు ఎస్ఐ దుర్గా ప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం మండలం బండారులంక అంబేద్కర్ నగర్ సమీపంలో ఆదివారం రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. అంబాజీపేటకు చెందిన పరమట ఏసురత్నం (65) బైకుపై అమలాపురం నుంచి అంబాజీపేట వెళుతున్నాడు. ఈ సమయంలో కాకినాడ నుంచి భీమవరం వైపు వెళుతున్న కంటైనర్ వెనుక నుండి ఢీకొంది. దీంతో ఏసురత్నం అక్కడికక్కడే మృతి చెందాడు. అమలాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా అప్పారావు పుట్టినరోజు

ప్రజాశక్తి - ఐ.పోలవరం

మండలంలో జి.మూలపొలం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న యర్రగురువు గ్రామంలో సీనియర్ వైసిపి నాయకులు రేవు అప్పారావు 70వ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయనకు పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. యువ నాయకుడు రేవు చిన ధనరాజు ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు, ముఖ్యమైన నాయకుల సమక్షంలో శనివారం రాత్రి కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్నవారికి విందు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో కాటం సత్తిరాజు, మందపాటి భైరవస్వామి, కందికట్ల బాలయోగి, దండుప్రోలు వెంకటరమణ, ఉండ్రు గంగాధర్, లంకే సత్యనారాయణ, బొంతు అప్పలరాజు, కొండయ్య,కాలాడి గంగాధర్, కుటుంబసభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడలకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - కొత్తపేట

కొత్తపేట మండలం వానపల్లి జడ్‌పి ఉన్నతపాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని పలివెల లావణ్య జాతీయ స్థాయి టెన్నీ కాయిట్ పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయులు ముద్రగడ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ నెల 8, 9వ తేదీలలో బాపట్ల జిల్లా చీరాల లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో విజయం సాధించి ఈనెల 26 నుంచి 30 వరకు జమ్మూ కాశ్మీర్ లో జరుగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. విద్యార్థినికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్. వెంకటరమణ, కె.అగ్నికుమార్, లావణ్యాను హెచ్‌ఎం వెంకటేశ్వరరావు ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ పల్లి భీమారావు, విద్యాకమిటీ ఛైర్మన్ వి.శ్రీనివాసరావు, గ్రామస్తులు అభినందించారు.

బాల బాలాజీ ఆలయ ధర్మకర్తగా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీబాలబాలాజీస్వామి దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తగా ఆలయ వ్యవస్థాపకులు దేవదూత మొల్లేటి రామస్వామి తనయుడు మొల్లేటి లక్ష్మీనారాయణ (చక్రి) ఆదివారం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. లక్ష్మీనారాయణ చేత ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ధర్మకర్త దంపతులకు నూతన వస్త్రా లు బహూకరించి శ్వేతవస్త్రం కట్టి సత్కరించారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన ధర్మకర్తకు ఆలయ మర్యాదలతో అర్చక స్వాములు ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు, వేద ఆశీర్వచనం అందజేశారు.

యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తా

మొల్లేటి రామస్వామి,ఆదిలక్ష్మి దంపతుల విగ్రహాలకు లక్ష్మీనారాయణ(చక్రి) పూలమాలలు సమర్పించి వారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా చక్రి మాట్లాడుతూ తన తండ్రి రామస్వామి ఆశయాల అనుగుణముగా యాత్రికులకు మెరుగైన మౌలిక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన ఎంఎల్‌ఎ గిడ్డి సత్యనారాయణకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ ఉద్యోగులు నూతన ధర్మకర్తకు శుభాకాంక్షలు తెలిపారు. జనసేన సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వన సమారాధన

ప్రజాశక్తి - యానాం

ది యానాం తెలగా (కాపు)అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో కాపు కార్తీక వన సమారాధన కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని సుంకరపాలెం గోపాల్‌నగర్ బైపాస్ జంక్షన్ వద్ద నున్న పెద్దిరెడ్డి కృష్ణవినాయకరావు యానాం కాపు కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో యానాం తెలగా అభ్యుదయ సంఘం అధ్యక్షులు కాటంశెట్టి వెంకటరామ్మూర్తి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, ఎంఎల్‌సిలు తోట త్రిమూర్తులు, పేరాబత్తుల రాజశేఖరం పాల్గొన్నారు. సామూహిక సహపంక్తి వనభోజనాలు చేశారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖరం

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - కరప

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి బాధితులకు మంజూరైన చెక్కులను ఎంఎల్‌ఎ పంతం నానాజీ అందజేశారు. ఆదివారం గుడారిగుంటలోని ఆయన కార్యాలయంలో సుమారు రూ.10.98 లక్షల విలువైన చెక్కులను బాధితులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పంతం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాల విస్తరణకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ విధానాల కారణంగా వచ్చిన ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అర్హులైన వారికి ప్రభుత్వం సహాయం అందజేస్తోందని అన్నారు. ఇప్పటివరకు 182 మంది దరఖాస్తులు చేసుకోగా, అందులో 135 మందికి సుమారు రూ.1.34 కోట్లను బాధితులకు అందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కరప ఎఎంసి ఛైర్మన్ ముద్రగడ రమేష్, నాయకులు పుల్ల శ్రీరాములు, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ నానాజీ

పారిశుధ్య కార్మికులకు సన్మానం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

తన తండ్రి వర్ధంతిని పురస్కరించుకుని నానిశెట్టి మణికంఠ, కుటుంబ సభ్యులు ఆదివారం స్థానిక నగర పంచాయతీ కార్మికులను సన్మానించారు. ఏలేశ్వరంకు చెందిన నానిశెట్టి నారాయణరావు ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తూ మూడేళ్ల క్రితం మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయన తనయుడు మణికంఠ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల అందిస్తున్న సేవలు ఎనలేనివని, కోవిడ్ సమయంలో అహర్నిశలు పనిచేశారని కొనియాడారు. తమ తండ్రి జ్ఞాపకార్థం వారిని సన్మానించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ వాగు రాజేష్, వివేకానంద సమితి అధ్యక్షుడు మైరాల నాగేశ్వరరావు, పాబోలు వినోద్, నానిశెట్టి సాయిరాం, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న నిర్వాహకులు

నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న అతిథులు

ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - పెదపూడి

మండల ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా దోమాడ గ్రామానికి చెందిన ఓబిలిశెట్టి మల్లికార్జునరావు ఎన్నికయ్యారు. ఆదివారం కడకుదురులో జరిగిన సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షునిగా మల్లిఖార్జునరావు, కార్యదర్శిగా సిరివిశెట్టి సూర్యప్రకాశ్, కోశాధికారిగా ఓబిలిశెట్టి గోపాలకృష్ణ ఎన్నికయ్యారు. సామాజిక సేవలే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా అధ్యక్షుడు పులవర్తి కుమార్ నూతన కమిటీకి సూచించారు. నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికున్నందుకు అధ్యక్షుడు మల్లిఖార్జునరావు కృతజ్ఞతలు తెలిపారు.

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - రౌతులపూడి

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని సిఐ బి.సూర్యఅప్పారావు హెచ్చరించారు. ఆదివారం మండలంలోని ఎం.కొత్తూరు పంచాయతీ దిగువ దారపల్లిలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, సారా వంటి వాటికి దూరంగా ఉండాలని అన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - పెద్దాపురం

నియోజకవర్గ పరిధిలో రూ.150 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఆదివారం స్థానిక ముప్పన వారి గాలి బంగ్లాలో జరిగిన సూర్య బలిజ సంక్షేమ సంఘం వన సమారాధనలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, తుమ్మల పద్మజ, బడుగు శ్రీకాంత్, బిక్కిన విశ్వేశ్వరరావు, పొలమరశెట్టి సత్తిబాబు, చెరుకూరి రవికృష్ణ, రంది సత్యనారాయణ, సూర్య బలిజ సంక్షేమ సంఘం అధ్యక్షులు అన్నాబత్తుల అంజిబాబు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయానికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక భీమేశ్వరాలయానికి ఆదివారం యాత్రికులు పోటెత్తారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి యాత్రికులు ఆలయానికి విచ్చేశారు. యాత్రికులకు అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. యాత్రికులకు ఏర్పాటు చేసిన భద్రత ఏర్పాట్లును డిఎస్‌పి డి.శ్రీహరిరాజు, సిఐ జయశంకర్, ట్రాఫిక్ ఎస్ఐ అడపా గారగారావు పరిశీలించారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కార్యనిర్వాహణాధికారి బళ్ళ నీలకంఠం, ధర్మకర్తల మండలి ఛైర్మన్ కంటే జగదీశ్ మోహన్ తెలిపారు.

గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, ఎస్‌ఆర్.రంగనాథం, గాడిచర్ల హరి సర్వోత్తమరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయితీ స్రవంతి కార్యదర్శి కొత్త శివ అధ్యక్షతన జరిగిన సభలో ప్రముఖ కవి జోష్యుల కృష్ణబాబు, వినియోగదారుల సంఘం అధ్యక్షులు బళ్లమూడి సూర్యనారాయణమూర్తి, సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు చల్లా విశ్వనాథం, పెద్దాపురం చరిత్ర పరిశోధకులు వంగలపూడి శివకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పాలంకి నాగరాజు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

బిసిలు ఐక్యతతో ముందుకు సాగాలి

- శెట్టిబలిజల వన సమారాధనలో మంత్రి సుభాష్
- రూ. కోటి విరాళం ప్రకటించిన మంత్రి

ప్రజాశక్తి - అమలాపురం

జనాభాలో అధిక శాతం ఉన్న బిసిలు ఐక్యంగా ఉంటూ ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయ చైతన్యం కలిగి ముందుకు సాగాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. ఆదివారం అమలాపురంలోని సత్తెమ్మ తల్లి ఆలయం ఆవరణలో జరిగిన ఉభయ తెలుగు రాష్ట్రాల 4వ శెట్టిబలిజ వన కార్తీక సమారాధన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సుభాష్ పాల్గొని సుదీర్ఘంగా మాట్లాడారు. తెలుగు రెండు రాష్ట్రాల్లో ఉన్న శెట్టిబలిజలను ఒకే వేదికగా తీసుకొచ్చి వారిలో ఐక్యత నింపే ఉద్దేశంతో, ఆత్మీయ కలయిక ఏర్పాటు చేశామన్నారు. తమ ఆహ్వానాన్ని మన్నించి లక్షలా దిగా తరలి వచ్చిన కుటుంబసభ్యులను చూసి మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ స్థాపించి, వ్యక్తిగతంగా కోటి రూపాయలు నిధులు విరాళం ప్రకటించారు మంత్రి. వారం రోజుల్లో ఈ నిధులను ఎస్ఐఎఫ్ అకౌంట్ లో జమ చేస్తానన్నారు. మంత్రి సుభాష్ తండ్రి, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రమణ్యం, ఎంఎల్‌సి కుడిపూడి సూర్యనారాయణ రావు, శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ కుడిపూడి సత్తిబాబు తదితరులు మాట్లాడుతూ శెట్టిబలిజల కోసం మంత్రి సుభాష్ చేస్తున్న సేవలను అభినందించారు. శెట్టిబలిజలకు రాజ్యాధికారం దిశగా కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో పెచ్చెట్టి చంద్రమౌళి, సివిల్ సప్లై డైరెక్టర్ కడలి ఈశ్వరి, పెచ్చెట్టి విజయలక్ష్మి, గుత్తుల సాయి, వాసంశెట్టి చినబాబు, చొల్లంగి వేణుగోపాల్, వాసంశెట్టి రాజేశ్వరరావు, తదితరులు పాల్గొని మాట్లాడారు.

కార్తీక వన సమారాధన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

మడికి వద్ద డ్రెయినేజీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఆలమూరు

ప్రమాదాలు అనునిత్యం జరుగుతుండడంతో బ్లాక్ జోన్‌గా పేరొందింది. ఆలమూరు మండలం చెముడులంక నాలుగు లైన్ల 216 ఎ జాతీయ రహదారిపై సర్వీసు రోడ్డు మంజూరు అయింది. దీనికి సంబంధించి మడికి కూరగాయల మార్కెట్ వద్ద నుంచి ముందుగా డ్రెయినేజీ కోసం జెసిబి తో ఆదివారం పనులు ప్రారంభమయ్యాయి. నిజానికి ఈ సర్వీస్ రోడ్డు మడికి కూరగాయల మార్కెట్ నుంచి చొప్పెల్ల లాకుల వరకు సుమారు 3 కిలోమీటర్ల మేర నిర్మించనున్న మాట విధితమే. ముందుగా ఖాళీ ప్రదేశాలను శుభ్రం చేసి కల్వర్టులు, డ్రెయినేజీ వంటివి నిర్మించాలని కాంట్రాక్టర్లు తెలుపుతున్నారు. అయితే సమస్య ఉన్న చోట ఉన్నత అధికారులు, స్థానికలతో చర్చలు జరిపి చర్యలు తీసుకుంటారని హైవే సిబ్బంది అంటున్నారు. ఈ రోడ్డు జాతీయ రహదారి మార్జిన్ వైట్ గీత నుంచి 12 మీటర్ల వరకు ఈ సర్వీస్ రోడ్ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే మొత్తం 12 మీటర్లలలో ప్రస్తుత రోడ్డుకు ఒక మీటరు మార్జిన్, ఒక మీటరు డివైడర్, ఆ తర్వాత 7.5 మీటర్లు సర్వీస్ రోడ్ నిర్మిస్తారు. అక్కడ నుండి మీటర్నర వెడల్పుతో డ్రెయినేజీ నిర్మాణం, ఆ తర్వాత మరో మీటరు విద్యుత్తు స్తంభాల ఏర్పాటుకు కేటాయించారు. ఇలా 12 మీటర్ల వెడల్పుతో ఈ సర్వీస్ రోడ్డు నిర్మాణం జరగనుంది. వైజాగ్ కు చెందిన సుధర్మ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ వారికి ఈ సర్వీస్ రోడ్ నిర్మాణ పనులు అప్పగించారు. దీనిపై కాంట్రాక్టు వారు మాట్లాడుతూ ముందుగా ఆక్రమణల తొలగింపు, డ్రెయినేజీ నిర్మాణం, అనంతరం విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి లైన్లను మారుస్తారన్నారు. అయితే ఈ రోడ్డు పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలు ఈ డ్రెయినేజీ నిర్మాణం రావడం వల్ల వీధిల్లోంచి రోడ్డుపైకి రావడం చాలా కష్టతరంగా ఉంటుంది. అందుకు సంబంధించి ప్రతి రోడ్డుకు ప్రత్యేక ర్యాంప్‌లు ఏర్పాటు చేస్తామని కాంట్రాక్ట్ ప్రతినిధులు తెలుపుతున్నారు.

ముమ్మరంగా సాగుతున్న డ్రెయినేజీ పనులు

ఘనంగా విజయ ఆర్థోపెడిక్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం పట్టణం స్థానిక గోకులే సెంటర్ పిల్లల పార్కు వద్ద ఉన్న విజయ ఆర్థోపెడిక్ ఆస్పత్రి ఐదవ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహి ంచారు. విజయ ఆర్థోపెడిక్ ఐదు సంవత్స రాలు విజయవంతంగా పూర్తి చేసుకుని ఆరో సంవత్సరంలో అడుగుపెడు తున్న సందర్భం గా డాక్టర్ వెంకటేష్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వైటిబి.వెంకటేష్ మాట్లాడుతూ కీళ్లవాతం, మోకాళ్ళ నొప్పులు, మెడ నొప్పి, నడుము నొప్పి తదితర సమస్యలకు అత్యాధునిక పద్ధతుల్లో వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు.



ముమ్మిడివరం తాలూకా ఎన్‌జిఒ నూతన కార్యవర్గం

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

సుదీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి ఎపి ఎన్‌జిజిఒ సంఘం కషి చేస్తుందని ముమ్మిడివరం తాలూకా నూతన కార్యవర్గ అధ్యక్ష కార్యదర్శులు పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయం ఆవరణలో ఆదివారం ముమ్మిడివరం తాలూకా ఎపి ఎన్ జిజిఒ సమావేశం జిల్లా అడహక్ అధ్యక్షుడు మాధవరపు వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో పిఆర్‌సి, ఐఆర్, డిఎ తదితరఅంశాలపై చర్చించారు. అనంతరం అమలా పురం తాలూకా అధ్యక్షుడు సిహెచ్.రాజశేఖర్ ఎన్నికల అధికారిగా నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ప్రెసిడెంట్‌గాసిహెచ్‌ఎన్.దొర, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా డి.రమేష్, సిహెచ్.చిట్టిబాబు, వైస్ ప్రెసిడెంట్-1గా ఎంఆర్‌కె.ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్-2గా వై.ఇందిరా ప్రియదర్శిని, వైస్‌ప్రెసి డెంట్-3గా డిఎస్.చంద్రబాబు, సెక్రటరీగా బి.రాజేష్, జాయింట్ సెక్రటరీ-1గా పిడి.గాయత్రి, జాయింట్ సెక్రటరీ-2గా జె.బాలప్రసన్న, జాయింట్ సెక్రటరీ-3 ఎం. గోపి, మహిళా జాయింట్ సెక్రటరీగా పివి.రమణి, ట్రెజరర్‌గా ఎం.చిట్టిబాబులను సమావేశం ఏకగ్రీవ ంగా ఎన్నుకుంది. అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా జి.వెంకటేశ్వ రరావు వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను జిల్లా అడహక్ కమిటీ కన్వీనర్, సభ్యులు పూల మాలలు వేసి అభినందించారు.

మహారాజశ్రీ 3వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టు కాకినాడ

MVOP.No.113/2024

Between:-

పొలినాటి ప్రసాదరావు ...పిటీషనర్

మరియు

ఓలేటి దినేష్ వగైరాలు ...రెస్పాండెంట్స్

R2. జామి సీతారామ్ S/o. అప్పారావు డోర్ నెం.4-4-032, కాకివారి వీధి, యానం, పుదుచ్చేరి. (కారు యజమాని బెరింగ్ నెం.PY04 A 8572)

పై నంబరు పిటిషన్‌లో 2వ రెస్పాండెంట్ అయినన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు పంపినప్పటికి తీసుకొనక కాల యాపన చేయుచున్నందున సదరు సమన్లు అమలు నిమిత్తం **28-11-2025**వ తేదిన వాయిదా అయివున్నది. ఆరోజు ఉదయం **గం॥10.30ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేయగలరు లేనిచో మీ పరోక్షముగా తీర్మానించబడునని తెలియపరచడమైనది.

(By Court Order)

K.V.Bhadra Rao
K.Srivani
K.S.Chandra Rao
Advocates, Kakinada
9440177063

మహారాజశ్రీ 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు కాకినాడ

E.A.No.353/2025 in E.A.No.354/2025 in E.A.No.309/2025 in O.S.No.63/2008

మధ్యన

1). శ్రీమతి చెరుకూరి కామాక్షి వగైరాలు ...పిటిషనర్లు

మరియు

1). తుమ్మల రామస్వామి (డైడ్) వగైరాలు ...రెస్పాండెంట్లు

టు

R3. పిన్నం వెంకట సుబ్బారావు, తండ్రి. బ్రహ్మం, వ్యసాయం, డో.నెం. 1-69, మర్లలోవ గ్రామం, పెద్దాపురం మండలం.

R4. శ్రీమతి పిన్నం పద్మావతి, భర్త వెంకట సుబ్బారావు, గృహిణి, డోర్‌నెం. 1-69, మర్లలోవ గ్రామం, పెద్దాపురం మండలం

పై నెంబరు కేసులో మీకు కోర్టు ద్వారా నోటీసులు పంపిన పుచ్చుకొనక తిప్పి వేయుచున్నారు. పై నెంబరు కేసు మరియు E.A.No.353/2025 , E.A.No. 354/2025 లలో **ది.01-12-2025**వ తేది ఉదయం **గం.10.30ని॥లకు** పై కోర్టులో వాయిదా అయివున్నది. కావున మీరు స్వయముగా కాని లేక ప్లీడరు గారి ద్వారా కాని హాజరు అయి ఆక్షేపణలు తెలియపర్చుకొనవలెను. లేని యెడల పరోక్షమునందు తీర్మానించబడును.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

వి.వి.కేశవరమణరావు, అడ్వకేట్,
డోర్‌నెం. 25-5-20,
వినుకొండవారి వీది
కాకినాడ, సెల్.9848048497